
# చిప్ప

టి. సంపత్ కుమార్



చక్రం తిరుగుతోంది. గిరగిరా తిరుగుతోంది. ముందుకు కాదు - వెనక్కు కాదు. తన చుట్టూ తాను తిరుగుతూనే ఉంది. వేగం తగ్గినపుడు కర్ర పుచ్చుకొని కదులుతున్న చక్రం పట్టు దొరికించుకొని శక్తి కొద్దీ తిప్పి వదిలాడు గంగన్న. ఎంత వేగంగా తిప్పి వదిలినా చక్రం పైనున్న మట్టి ముద్ద తన ప్రభావాన్ని చూపుతూనే ఉంది. భారంగా తిరుగుతోంది. నిండుగర్భిణి నడకలా ఉంది. గంగన్న వంగి మోకాళ్లపై మోచేతుల్ని మోపి, వెన్న లాంటి మట్టి ముద్ద నుండి కుండల్ని తయారు చేయసాగాడు. బ్రహ్మ పుట్టించిన జీవుల్లో ఎంతో వైవిధ్యం! ఆకారాల్లో తేడా. రంగుల్లో తేడా. బుద్ధుల్లో అసమానత. సమస్తం వైవిధ్య భరితం! కాని గంగన్న చేతుల్లో పురుడు పోసుకుంటున్న ఏ వస్తువైనా సాంచాలోంచి ఊడిపడ్డట్టుగా ఉంటుంది. కొలతల్లో తేడా రాదు. ఆకారంలో మార్పు ఉండదు. అంత ఏకాగ్రతతో 'మట్టి' పని చేస్తాడు గంగన్న. ఆ ఊళ్లో ముగ్గురు గంగన్నలున్నారు. అంచేత అందరూ పేరుకు ముందు కులవృత్తి జోడించి 'కుమ్మరి గంగన్న' అనే పిలుస్తారు.

కుమ్మరి గంగన్న చేసిన మట్టి వస్తువులు లేని ఇల్లు ఆ ఊళ్లో లేదు. చిరుదీపాల్ని పెట్టుకొనే దివ్వెలనుండి తవ్వల కొద్దీ గింజల్ని దాచుకునే కాగుల వరకూ గంగన్న చేతులు తాకినవే! ఎండ కాలంలో చల్లనినీళ్లిచ్చే కుండల నుండి ఇంటిని కప్పే గూన వరకు గంగన్నచేతిలో రూపం దిద్దుకున్నవే! పిల్లలకు పొదుపు నేర్పే డబ్బులు దాచుకునే గురిగల నుండి వధూవరుల్ని ఏకం చేసే ఐరేని కుండల వరకు గంగన్న చేతులు తాకినవే! ఎవరి అంతిమయాత్రలో నైనా అగ్గిని తీసు కెళ్లేది ఆయన చేసిన కుండల్లోనే! మనుషులకే కాదు, పశువులకు కూడా ఆయన వస్తువులు కావాలి. దాణా తినిపించే మట్టికంచాల నుండి కుడితి కలిపే బాణాల వరకూ అతను ఆప్యాయంగా చేసినవే!

గంగన్నకు తన తాత మట్టిపని చేయడం బాగా జ్ఞాపకం ఉంది. ఆయన చేయి తిరిగిన పనిమంతుడు. ఎంత సున్నితమైన పనినైనా అవలీలగా చేసేవాడు. తాత ద్వారానే గంగన్న కుమ్మరి పనికి శ్రీకారం చుట్టాడు. పనిలోని మెలకువ లన్నింటినీ తాత ఓపిగ్గా చెప్పాడు. చక్రాన్ని తయారుచేసుకోవడం, మట్టి లక్షణాన్ని గుర్తించడం, మట్టిని తయారు చేసుకోవడం, చక్రాన్ని తిప్పడం, వస్తువుల్ని ఆరబెట్టడం, బట్టీలో అమర్చడం, కట్టెల్నికప్పడం, మంటను కావలసిన ప్రకారంగా చూసుకోవడం ... ఇలా ప్రతిదశనూ సులభంగా అర్థమయ్యేరీతిలో బోధిస్తూ మంచిశిక్షణ నిచ్చాడు. గంగన్నకు తల్లి తెలియదు. తనను కన్ను తెరిపించి తాను కన్ను మూసింది. ఆరేళ్ల వయసప్పుడు బట్టీకి కట్టెల కోసం అడవికి వెళ్లిన తండ్రి పాముకాటుతో చనిపోవడంతో గంగన్నకు తండ్రి గురించి కూడా అప్పటికింకా జ్ఞాపకం లేదు. పెంపకమంతా తాత అజమాయిషీలోనే జరిగింది. కడుపునిండా భోజనం, సంఘంలో గౌరవం ఇచ్చి పుచ్చుకునే జీవనం.

ఓ రోజు తాత గంగన్న పనితనం చూసి "ఒరేయ్ గంగన్నా! నిన్ను మించిన పనోడు మన దిక్కు ఎక్కడా కూడా కనపడడురా. నిన్ను పుట్టించిన ఆ బ్రహ్మదేవుడు కూడా నీ మాదిరిగా మట్టిపని చేయ లేడురా!" అని ఎంతో మురిపెంగా, గర్వంగా మెచ్చుకున్నాడు. ముసలాయన సంతోషంతో ఉప్పొంగి పోయేవాడు. పందిరికింద మంచంమీద పడుకొని గంటలకొద్దీ గంగన్న చేతివేళ్ల వైపు అలా చూస్తూ ఉండేవాడు. మరీ సంతోషం కలిగినపుడు "నన్ను మించినోని వైనవురా!" అని మెచ్చుకోలుగా అనేవాడు. "నీ చేతుల్లో ఏదో మాయ ఉందిరా!" అని పొగిడేవాడు.

గంగన్న అన్ని విధాలా ప్రయోజకుడయ్యా

## షార్ట్‌హాండ్

**భ**ర్త మాధవరావు ఆఫీసు నుంచి ఇంటికి రాగానే గుమ్మంలోనే పట్టుకుంది లక్ష్మి. "పొద్దుట ఆఫీసుకెళ్లేప్పుడు నేను చెబుతుంటే సరకుల లిస్టు బుద్ధిగా రాశారు కదా! మరి ఏదో పిచ్చి గీతలున్న కాగితం ఆ కొట్టువాడికెందు కిచ్చారండీ? ఇందాక వాడు ఫోన్ చేసి చెప్పి, సరకులు పంపలేమన్నాడు!"

"అదా సంగతి ... నా కెవరు డిక్టేట్ చేసినా, షార్ట్‌హాండ్‌లో రాసుకోవడం నా అలవాటు!" స్టెనోగ్రాఫరైన మాధవరావు తాపీగా అన్నాడు.

- ఎస్. హన్మంతరావ్ (విశాఖపట్నం)

డని తాతకు నమ్మకం కలిగింది. వయస్సు యోగ్యత ను తెచ్చింది. మీసం కట్టు తాతకు కర్తవ్యాన్ని గుర్తుచేసింది. మట్టి వేయకుండా చక్రాన్ని ఎంత కాలం తిప్పుతాం? అని ప్రశ్నించుకున్నాడు.

గంగన్నకు ఐదేళ్ల వయసపుడే పెళ్లయ్యింది. భార్య పేరు నర్సు. చుట్టం చూపుగా అప్పుడప్పుడు పండగకో, పబ్బానికో అత్తగారింటికి వెళ్లొచ్చే వాడు. ఇంట్లో ఆడదిక్కు లేకపోవడంతో నర్సు మొగుడిం టికి వచ్చేది కాదు. ఇప్పుడు ఇద్దరూ ఎదిగారు. మనసులు ఎదిగాయి. చక్రంపై మట్టిముద్ద ఒది గింది. చక్రం ఊపందుకుంది. సంసారం పుంజు కుంది.

దేశం రెండవ పంచవర్ష ప్రణాళికలోని పేజీలను ముందుకూ, వెనక్కూ తిప్పుతోంది. అందులోని అక్షరాలు కోట్ల ప్రజల జాతకాన్ని చెబుతున్నాయ్. కమ్మరి వేసే సుత్తి పోట్లకు 'పగ్గాలు' ఎక్కడో కలం పోట్ల కింద అణగివున్నాయ్. వడ్రంగి రంపపు 'పొట్టు' ఏదో వాక్యంతో ముడిపడిపోయింది. చేనేత పనివారి మగ్గాల్ని లయతప్పించే పారాగ్రాఫులు కూడా రూపుదిద్దుకున్నయ్.

కొవ్వొత్తి వచ్చి దివ్వెను వెక్కిరించిది. ప్లాస్టిక్కొచ్చి కుండల్ని, బాణాల్ని ఎద్దేవా చేసింది. "పగిలి పోను-విరిగి పోను" అంటూ అల్యూమినియం హం గామా చేసింది. బెంగుళూరు గూన మెరుపుదాడి చేసి స్థానికంగా తయారయ్యే గూనను వెన్నుపోటు పొడిచింది. చిరకాలం ఉంటామని ప్రకటించు కుంటూ రేకుడబ్బాలు కాగుల్ని కాలంలో కలిపే శాయి. కుమ్మరిబతుక్కు సంవత్సరమంతా వర్షకాల మొచ్చింది.

నర్సు నీళ్లోసుకుంది. సన్నగా ఉన్నా చురుగ్గా, తెలివిగా ఉండేది. కడుపుతో ఉందని తెలిసినప్పటి నుండి గంగన్న భార్యను జాగ్రత్తగా చూసుకో సాగాడు. రూపం పోసుకున్న కుండను చక్రం మీది నుండి తీసి భూమిపై మోపేందుకు తీసుకునేంత శ్రద్ధ చూపే వాడు.

మనవడి సంసారాన్ని చూసుకుంటూ తాత ఎంతో మురిసిపోయేవాడు. ఆడమనిషి లేని ఇంట్లో నర్సు రావడంతో ఇంటికి నిండుదనమొచ్చింది. చిన్నప్పటి నుంచే పుట్టింటి పనుల్లో ఆరితేరిన నర్సు, ఇంటిని తొందరలోనే ఒక కొలిక్కి తెచ్చింది. తాతను ప్రేమ తో చూసుకొనేది. కావలసిన వాటి ని సమకూర్చేది. పళ్లు లేవని అన్నా న్ని మెత్తగా వండేది. కూరల్ని గుజ్జు గుజ్జుగా చేసేది. అప్పుడప్పుడు చిరు తిండ్లు ఇచ్చేది. ఒక్కోసారి టీ కూడా చేసి ఇచ్చేది. గంగన్నకు పనిలో కుడిచేయిలా తోడ్పడేది. తాత తాను ముత్తాత కాబోతున్నా నని తెలుసుకొని మనవరాలికి విశ్రాంతి ఇవ్వాల న్నాడు. ఓ రోజు వాత్స ల్యంతో "ఒరేయ్ గంగన్నా! ఇక దానికి పని చెప్ప కురా! నీకేమైనా సాయం కావాలంటే నాకు చెప్పరా" అన్నాడు.

పొలం లేకున్నా గంగన్నకు తిండిగింజలకు కొదువలేదు. వస్తుమార్పిడి విధానం అప్పట్లో ఇంకా చెలామణిలో ఉంది. రైతులకు కావలసిన కుండలు, ఇతర సామగ్రి సమకూరిస్తే, ఒప్పందం ప్రకారం పంటలు రాగానే ధాన్యం వచ్చేది. అది ఒక్కోసారి అవసరాన్ని మించేది. అంగట్లో కుండల అమ్మకంతో చిల్లరఖర్చులు తీరిపోయేవి. అప్పుడప్పుడు ఎడ్లబండి పై మట్టివస్తువుల్ని నింపుకొని చుట్టుపక్కల ఊళ్లల్లోకి అమ్మకానికి వెళ్లేవాడు. పండగలు, శుభకార్యాలు ఆదాయాన్ని పెంచేవి. నర్సు ఓ రోజు గంగన్నను అడిగింది.

"ఇయ్యాల ఓ పెద్ద గురిగిని జెయ్యి."

"ఎందుకే?"

"ఎందుకంటే పైసలు జమ జేసేతందుకు. పైస పైస జమయితే కాని రూపాయి కాదు."

"ఆ మూలన పడి వున్నయ్. దాంట్లోంచి ఏరు కో ఓ గురిగిని."

"అయ్యి మరీ చిన్న గున్నయి. జల్దీ నిండుతయ్. జమయిన వాటితో ఓ పని గాదు, పాట గాదు. నా కోసం ఓ పెద్ద గురిగిని జెయ్యి. నిండితె మాసమో, రెండుమాసాలో బంగారం కొనొచ్చు" గోముగా అంది.

పెళ్లాం ఆలోచనలకు సంబరపడిపోతూ ఆ రోజే ఓ చిన్నకుండంత గురిగిని చేశాడు. పెళ్లాం అడిగింది కదా అని తన పనితనాన్నంతా చూపి అందంగా తయారు చేశాడు. పౌరాణికం సినిమాల్లో చూపించే పాత్రలా నగిషీలతో సింగారించాడు గురిగిని. బట్టీలో వస్తువుల్ని పేర్చేటప్పుడు గురిగిని పదిలంగా ఓ ప్రత్యేకస్థానంలో ఉంచాడు. వేడి సరైన మోతాదులో తగిలి చక్కగా పండేలా జాగ్రత్త లు తీసుకున్నాడు. బట్టీ చల్లారగానే ఒక్కో వస్తువు నూ మెల్లగా తీయడమారంభించాడు. పండిన వాటినో వైపు, పగుళ్లు చూపినవాటి నో వైపు పెట్టాడు. ఆసక్తిగా వెదుకుతున్న కళ్లకు బూడిదలో దాక్కున్న గురిగి కనబడింది. ఆప్యాయంగా తీసి బూడిదను ఊదేశాడు. నగిషీలన్నీ గట్టి పడ్డాయి. అటూ - ఇటూ తిప్పి చూశాడు. నాణాలు వేసే రంధ్రాన్ని నునుపు చేశాడు. దాని తాలూకు పెచ్చులు లోన పడితే తలకిందులు చేసి అదే రంధ్రం ద్వారా బ యటకు లాగాడు. రంధ్రాన్ని గట్టిగా ఊది శుభ్ర పరిచాడు. నర్సును పిలిచి "ఇగో, గురిగి తీస్కో" అని చేతిలో పెట్టాడు. ఆమె ముఖం వికసించింది. 'ఇయ్యాళ్ల మంచి రోజు. ఏమన్న ఏసి బోనిజెయ్యి' అంది. చిలక్కొయ్యకు వేలాడుతున్న ఆసారం జేబులోంచి ఓ నాణాన్ని తీసి గురిగిలో వేశాడు. అది ఠన్‌మని శబ్దం చేసి చీకట్లోకి జారుకుంది.

నర్సు శరీరంలో మార్పు లొస్తున్నాయి. గురిగి బరువూ పెరుగుతోంది. ఆ ఊళ్లో లభించే వైద్య సలహాలను, పెద్దల అనుభవాలసారాలను పాట 'స్తోంది. ఇంట్లో మరో ఆడమనిషి లేదు. పనంతా తానే చేసుకోవాలి. దానికి తగ్గట్టు గంగన్న పనుల్లో కూడా కల్పించుకుంటుంది. కావలసిన విశ్రాంతి లేక శరీరం నీరసంగా, కాంతిహీనంగా ఉండేది.

ఓ రోజు రాత్రి కడుపులో విపరీతమైననొప్పి. భరించలేక నర్సు మూలుగుతూంది. గంగన్న, తాత గాభరా పడిపోయారు. అటక మీద ఎలుక ఒకటి ఇటూ అటూ పరుగెత్తింది. చూరు అంచున పెట్టిన గురిగి పుటుక్కునకిందపడి టప్‌మని పగి లింది. ఇంకా పూర్తిగా నిండని గురిగి!

అందరూ గొల్లుమన్నారు.

దుఃఖంతో నర్సు మంచంలో పడివుంది. కుమి లిపోయింది. గంగన్న పక్కకు చేరి ఓదార్చే ప్రయ త్నం చేశాడు. ఏడుస్తూనే ఉంది. తాత తన బాధను ఎవ్వరితో చెప్పుకోలేక, తనలో తానే మూలుగుతు న్నాడు. మనవరాలికి ధైర్యం చెప్పేందుకు లోపలి కెళ్లాడు. నర్సు ఇంకా రోదిస్తూనే ఉంది. తాతను చూసి గట్టిగా ఏడ్చింది.

"ఊర్కోవే! నువ్వేడుస్తే నా కేడుపొస్తుందే!" ఓదారుస్తూ అమాయకంగా అన్నాడు గంగన్న.

"మనమేం పాపం జేసినమని ఈ కష్టాలు ... నీ చేతుల్లో ఒక్కకుండ కూడా చిటికిపోదు. దేవుడు ఇన్నేండ్ల నుంచి మనుషుల్ని జేస్తున్నడు. ఆయన చేతుల్లో ఇంకా మనుషులు చిటికిపోతారెందుకే!" ఏడుస్తూ కోప వచ్చి పడిపోయినంత పని చేసింది.

రాత్రి ఎలాగో గడిచింది. కొంత కాలం విశ్రాంతి కోసం నర్సును పుట్టింటికి పంపాడు.

మూడవ పంచవర్ష ప్రణాళిక వచ్చేసింది. రెండు ప్రణాళికల అనుభవాన్ని నింపుకొని వచ్చింది. గంగ న్న ఇంట్లో మూడుసంత్సరాల బాబు ముచ్చటగా

తిరుగుతున్నాడు. తాత మునిమనవణ్ని కళ్లారా చూసుకుంటూ తనివితీరా గడిపేవాడు.

నాల్గవ పంచవర్షప్రణాళిక రాకముందే తాతకు మరో మనవడు తోడయ్యాడు. ప్రణాళిక ఆఖరి సంవత్సరం చేరేసరికి నర్సు మళ్లీ గర్భవతి. ఆడ పిల్లకు జన్మనిచ్చి నర్సు తెరవెనక్కి వెళ్లి పోయింది.

మరో రెండు పంచవర్షప్రణాళికలు దేశాభివృద్ధిలో మైలురాళ్లలా వచ్చాయి. ప్రణాళికలు రూపొందించడంలో దేశం ఓణీల వయసును దాటి చీర కట్టుకొని చాలా సంవత్సరాలయింది. చీర మడతల్లో చిరుగులున్నాయి.

పిల్లలు పెరుగుతున్నారు. కుల వృత్తిలో చేతుల్ని ఆడిస్తున్నారు. తాత తన నైపుణ్యాన్నంతా ముని మనవలకు నూరి పోశాడు. మట్టిని, చక్రాన్నే నమ్ముకోండ్రా అని ఉపదేశిస్తూ తన తోవపట్టాడు. చిన్నప్పటి నుంచి తనకు తల్లీ, తండ్రీ అయి, ఇంటికి ఓ పెద్దదిక్కుగా మసలుకున్న తాత పోవడంతో గంగన్నకు నడ్డి విరిగినట్టయింది.

మార్పు అనివార్యం. ఆలోచనల్లో మార్పు. అలవాట్లలోమార్పు. దోమకాటులోమార్పు. నీటి ఊటల్లో మార్పు. గాలిలోమార్పు. ఋతుపవనాల నడవడిలో మార్పు. తల్లి పాలలో మార్పు. పరిసరాల్లో మార్పు. పదిహేను లక్షలకు పైగా ఉన్న ప్రజాపతుల జీవనాల్లో మార్పు. గంగన్న జీవితంలో మార్పు.

గ్రామాల్లో, టౌన్లలో ప్లాస్టిక్‌వస్తువులు చాప కింది నీరులా ప్రజల జీవనంలో స్థానాన్ని ఏర్పరచుకుంటున్నాయి. తేలిగ్గా, అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. కింద పడ్డా తమ కేమీ కాదంటూ శాస్త్రవేత్తల నుంచి అమృతాన్ని తాగి మరీ వచ్చాయి. తేలికలోహాలన్నీ కలిసి వ్యూహాన్ని రచించాయి. ఫ్యాక్టరీల్లో కరిగి, అన్ని రకాల 'అగ్నిపరీక్ష'లు జరుపుకొని సాంచాల్లోకి జారి రూపొంది దుకాణాల్లోకి తోవచేసుకున్నాయి. కుండలకు వైధవ్యం వచ్చింది. అడిగేవారు కరువయ్యారు.

అల్యూమినియం, హిండాలియం వచ్చి గంగన్న పెద్దకొడుకును బొంబాయి తరిమాయి. ప్లాస్టిక్కొచ్చి రెండవకొడుకును దుబాయి పంపింది. ఇద్దరికీ మరోసారి బొడ్డుతాడు కస్సున తెగింది.

గంగన్నకు బ్రతుకు భారమయింది. చక్రం గోడకు ఒరిగింది. కాయం వయస్సును మించిన వయస్సును చూపుతోంది. క్షయ శరీరంలో తిష్ఠ వేసింది. చేసిన వస్తువులకు అమ్మకం లేదు. వస్తు మార్పిడి పద్ధతి కరెన్సీనోట్లకు కుదించబడింది. ఎవరైనా దయ తలిచి ఇస్తే తింటాడు. ఒక్కోసారి ఇరుగుపొరుగు వారిని అడుక్కునేస్థితి కూడా వచ్చింది. బొంబాయిలో ఉన్న కొడుకు గుర్తొచ్చాడు. వాడి దగ్గరికి వెళ్లాలన్న ఆలోచనలు ముసురుకొనేవి. అక్కడ సుఖంగా ఉంటానన్న ఆశలు లేవు. కొడుకుతో కొరివి పెట్టించుకుంటే స్వర్గంలో స్థలం దొరుకుతుందేమోనన్న నమ్మకం. బొంబాయి వెళ్లాలన్న కోరిక బలపడింది.

ఏడవ పంచవర్షప్రణాళిక పుటలు కదులుతున్నాయి.

ఉన్న ఊళ్లోనే అడుక్కుతినే స్థితి వచ్చింది. బొంబాయిలో మరి ఎలా ఉంటుందో! పుట్టినపుడు తనను తల్లినుంచి వేరుచేసింది తెలియదు. ఇప్పుడు తన తల్లి బొడ్డుతాడును తానే తెంపుకున్నట్టనిపించింది గంగన్నకు. బొంబాయికి ప్రయాణం కట్టాడు. ఏడాది క్రితం కొడుకు పంపిన అడ్రసు పుచ్చుకొని వెతికాడు. మురికివాడలన్నీ తిరిగాడు. తెలుగు మాట్లాడేవాళ్లు కనిపిస్తే అడిగాడు. మహానగరంలో ఆ మామూలు ప్రాణిజాడ ఎక్కడా కనబడ లేదు. చావనిఆశ ఇంకా వెదికించింది. తెచ్చుకున్న డబ్బు తనకు తెలియకుండానే ఖర్చవసాగింది. కొడుకు కలవకపోవడంతో గాభరా పుట్టింది. గుబులు గుబులుగా అనిపించింది. పిరికితనాన్ని ఎవరో శరీరంలోకి ఎక్కిస్తున్నట్టయ్యింది, మిగిలిన డబ్బుల్ని ధోవతి కట్టు మడతల్లో దాచాడు. మూటలో భద్రంగా ఉంచిన చిప్పను బయటకు తీశాడు. తనకున్న ఆస్తి ఆ చిప్పే! తాను చేసిన చిప్ప. అన్నం తినడానికే కాదు ... అడుక్కోడానికి కూడా ఉపయోగపడే చిప్ప.

చిప్ప చేతపట్టుకొని ఆశ తీసుకెళ్లిన ప్రతి చోటా అడుక్కోవడం మొదలుపెట్టాడు. కొందరు చీడపురుగులా చూస్తే మరి కొందరు కసురుకున్నారు. దానం చేసే వారి దృష్టిని ఆకర్షించడానికి తన దగ్గరేమీ లేదు. తోలువాద్యం లేదు. పాడే గళం లేదు. పాములేదు. కోతిలేదు. అంగ వైకల్యం లేదు. మాట్లాడగలడు. "అయ్యా, బాబూ! ధర్మం చేయండి ..." అని అంటూ తిరుగుతాడు. ఎముకల పై తోలు కప్పుకున్న రూపం లోతులనుండి బాధతో, జీరతో వచ్చే తనమాటే దానంఇవ్వడానికి జాలిని కలిగిస్తుంది. మధ్య మధ్యలో దగ్గు ... అప్పుడప్పుడు వణుకుతున్న చేతివల్ల చిప్పలోని నాణాలు కదిలి చిన్నగా శబ్దాన్ని చేస్తాయి.

బొంబాయి నగరం. ఎందరో నిరాశాపరులను తన దగ్గరికి లాక్కున్న నగరం. అందులో ఏ కొందరినో కోటి కెక్కించిన నగరం. రాత్రెరుగని నగరం. జనప్రవాహం ఆగనినగరం. మనుషుల్ని దాటుకుంటూ, దుకాణాల ప్రాంతంలో గంగన్న ఎదురీదుకుంటూ కదులుతున్నాడు. ఎవరో వేగంగా రావడం, రెప్పపాటులో గంగన్నను వెనకనుంచి గట్టిగా తగలడం జరిగాయి. తాను పడిపోవలసినవాడు. ఎలాగో సంభాళించుకొన్నాడు. అయినా వణుకుతున్న చేయి వశంతప్పి చిప్పను జారవిడిచింది. భళ్లునపగిలింది ... నాణాలు అన్నివైపులా పరుగు తీశాయి!

గంగన్నకు డబ్బుల గురించి ధ్యాస రాలేదు. వాటిని ఏరుకుందామన్న ఆత్రం కలుగలేదు. చిప్ప ముక్కలవైపు దీనంగా చూశాడు. తన చిప్పకు అడుక్కోడం నామోషీ అనిపించిందేమో! అనుకున్నాడు. తననుంచి ముక్తిపొందేందుకు ఇంత కంటె మార్గం లేదేమో! కింద పడగానే సంతోషంలో ముక్కలయ్యుంటుంది. మెల్లగా వంగి ముక్కల్ని ఒక్క చోట పెట్టాడు. భారతదేశపటపు జిగ్ -సా పజిల్‌లా ఉంది. కనుకొలకుల్లో ఎండకాలం ఊట లాగ నీరు మెల్లగా పేరుకుంది. బయటకు రాలేక, మళ్లీ కళ్లల్లోకే ఇంకి పోయింది. మరో చిప్ప కావాలి. వెంటనే కావాలి. భయంకరమైన వర్షంలో వచ్చే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. ఆ చిప్ప కూడా పగిలిపోతే...? పగలకుండా కాపాడుకోవాలి. అయినా ఎప్పుడో ఒకసారి పగలక పోదు.

ఒక జత కాళ్లు గంగన్న శరీరాన్ని మోస్తూ మెల్లగా అల్యూమినియం పాత్రలు అమ్మే దుకాణం వైపు దారి తీశాయి.

